# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 54 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 15, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## మోడీ ఇంట్లో కొత్త జీవి

### లేగదూడ ఫోటోను షేర్ చేసి ప్రధాని

**న్యూఢిల్లీ,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** మా ఇంట్లో కొత్త వ్యక్తి వచ్చి చేరిందంటూ ప్రధాని మోడీ వీడియో విడుదల చేశారు. ఢిల్లీలోని లోక్ కల్యాణ్ మార్గ్ లో ప్రధాన మంత్రి అధికారిక నివాసం ఉన్న విషయం తెలిసిందే. తన నివాసంలో ఉన్న ఓ ఆవు చిన్ని లేగ దూడకు జన్మనిచ్చింది ఆ దూడకు మోదీ నామకరణం



కూడా చేశారు. దూడ నుదుటిపై కాంతికి చిహ్నంగా ఒక ప్రత్యేకమైన గుర్తు ఉంది. ఈ విశిష్ట లక్షణాన్ని పురస్కరించుకుని దానికి ప్రధాని మోదీ 'దీప్‌జ్యోతి'అని పేరు పెట్టారు. తన నివాసంలో లేగదూడకు శాలువా కప్పి ప్రత్యేక పూజలు కూడా చేశారు. అందుకు సంబంధించిన వీడియోను పోస్టు చేశారు. వీడియోలో ప్రధాని మోదీ.. లేగదూడను ముద్దాడుతూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.

## కాళ్లు పట్టుకుని ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారు

**అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్ పాలన**

- పాడిని హౌజ్ అరెస్ట్ చేయించి దాడి చేశారు
- దాడి సమయంలో ఉన్న పోలీసులను సస్పెండ్ చేయాలి
- వందరోజుల్లో గ్యారెంటీలు అని తోక ముడిచారు
- అన్నివర్గాలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



**హైదరాబాద్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** రాష్ట్రంలో అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్ పాలన నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెచ్చిపోయి విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అమెరికా నుంచి హైదరాబాద్ తిరిగొచ్చిన కేటీఆర్.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసి, పోలీసులే దాడి చేయించారని ఆరోపించారు. పాడి కౌశిక్ రెడ్డిని పరామర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తొమ్మిదిన్నర నెలలుగా అసమర్థుడి జీవనయాత్రలా రేవంత్ ప్రభుత్వం కొనసాగుతుందని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి, రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పి అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి మోసం చేశారని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఎమ్మెల్యేల ఇంటికి చేరి, కాళ్లు పట్టుకొని మరీ కండువాలు కప్పుతాడని కేటీఆర్ విమర్శించారు. పదిమంది ఎమ్మెల్యేలు పోయారు, ఇంకా వస్తారు అని కాంగ్రెస్ మంత్రులు నుంచి ఎమ్మెల్యేల వరకు మాట్లాడుతున్నారని అన్నారు. హైకోర్టు తీర్పు తర్వాత కాంగ్రెస్‌లో భయం మొదలైందని తెలిపారు. ఫిరాయింపులపై స్పీకర్‌ను కలిసి సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉటంకిస్తూ పిర్యాదు చేశామని చెప్పారు. దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి మీద డిస్ క్వాలిఫై పిటిషన్ వేసింది కౌశిక్ రెడ్డి అని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున హైకోర్టు జస్టిస్‌కు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపండి, చావు డప్పులు కొట్టండి అని నాడు రేవంత్ రెడ్డి మాట్లాడారని కేటీఆర్ అన్నారు. కానీ హైకోర్టు తీర్పు వచ్చిన రోజు అరికెపూడి గాంధీని ఖంఅ చైర్మన్‌గా నియమిస్తూ ప్రకటన చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ ఎలా నియమిస్తారని అని ప్రశ్నిస్తే, పోలీసుల అండతో ఎమ్మెల్యే ఇంటిపై దాడికి దిగారని మండిపడ్డారు. ఈ రకమైన గుండాగిరి పదేళ్లలో ఎప్పుడూ లేదని తెలిపారు. ఫ్యాక్షన్ సినిమాలు తలపించేలా దాడులు చేశారని అన్నారు. రేపు జరగకూడనిది జరిగితే, ఎవరు బాధ్యత వహిస్తారు అని ప్రశ్నించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో ఇప్పటికైనా చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్యారెంటీలు అమలు చేయాలని అడిగితే ఇలాంటి హైడ్రామాలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. పైశాచిక ఆనందం కోసం ఇదంతా రేవంత్ చేస్తున్నాడని అన్నారు. కానీ ఇవన్నీ తిరిగి రేవంత్‌కు తిరిగి చుట్టుకుంటాయని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని స్పష్టం చేశారు.

పాడి కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసి, పోలీసులే దాడి చేయించారని కేటీఆర్ అన్నారు. దాడి జరిగినప్పుడు ఇక్కడ విధుల్లో విఫలమైన పోలీసులను సస్పెండ్ చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేసి, అర్ధరాత్రి వరకు తిప్పితే, తెలంగాణ ప్రజలు మొత్తం తమ వెంట నిలిచారని మిగతా.. 2లో

## ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల ప్రక్రియకు బ్రేకులు

- ఇంకెంతకాలం ప్రతిష్టంభంన కొనసాగిస్తారు
- సొంత రాష్ట్రాల్లో విద్యార్థులను నాన్ లోకల్ చేస్తారా
- ప్రభుత్వానికి మాజీమంత్రి కెటిఆర్ సూటిప్రశ్న

**హైదరాబాద్,సెప్టెంబర్14 (నమస్తే ఉదయం):** రాష్ట్రంలోఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల ప్రక్రియకు బ్రేకులు పడటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వైద్య విద్యను అభ్యసించాలని కోటి ఆశలు పెట్టుకున్న విద్యార్థుల జీవితాలతో ఏమిటీ చెలగాటమని ప్రశ్నించారు. పక్క రాష్ట్రాల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంటే.. తెలంగాణలో మాత్రం ఇంకెంత కాలం ఈ సందిగ్ధమని మిగతా.. 2లో



## త్వరలోనే ఆర్డినెన్స్...

### హైడ్రా ముమ్మాటికీ చట్టబద్ద సంస్థనే

**టాస్క్‌ఫోర్స్ తరహాలో అధికారాలు : కమిషనర్ రంగనాథ్ వెల్లడి**

**హైదరాబాద్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** హైడ్రా చట్టబద్ధతపై కొందరు ప్రశ్నిస్తున్నారు.. ఇది చట్టబద్ధమైనదే. జీవో 99 ద్వారా జులై 19న హైడ్రా ఏర్పాటు చేశారని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. కార్యనిర్వాహక తీర్మానం ద్వారానే ఏర్పాటు చేశారు. దీనికి చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ నెల లోపు ఆర్డినెన్స్ రానుంది. విశేష అధికారాలు కూడా రాబోతున్నాయి. 6 వారాల తర్వాత అసెంబ్లీలో హైడ్రా బిల్లు వస్తుంది. మున్సిపాలిటీలు, నీటిపారుదల, రెవెన్యూ మిగతా.. 2లో





## గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి

- గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు నిర్ణయం
- ప్రజావాణిలో గల్ఫ్ కార్మికలు వినతులకు సెల్
- మంత్రి పొన్నం అధ్యక్షతన సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ చేసింది. గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే ప్రాంతాల ఎమ్మెల్యేలు, నేతలతో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, చనిపోయిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని చర్చించారు. ప్రజావాణిలో గల్ఫ్ బాధితుల మిగతా.. 2లో

## ఆధార్ ఉచిత నమోదు 14 వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** ఆధార్ ఉచిత అప్‌డేట్ అవకాశం మళ్లీ పొడిగించారు. ఉచితంగా ఆధార్ కార్డుల్లోని వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు డిసెంబర్ 14 వరకూ గడువు పెంచుతున్నట్లు వెల్లడించింది.

ఆధార్ కార్డు వినియోగం ఎంత కీలకంగా మారిందో ప్రతి ఒక్కరికీ తెలుసు. సిమ్ కార్డు కొనుగోలు




మొదలు బ్యాంకు ఖాతాలు తెరవడం, వాహనాలు, ఇండ్లు, భూముల క్రయ విక్రయాలు.. ప్రభుత్వ పథకాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వంటి వాటికి అధార్ తప్పనిసరి అయ్యింది. అయితే.. వయసు పెరుగుతున్న కొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం సర్వసాధారణం. దీంతోపాటు ఇంటి చిరునామాలు మారుతుండ డంతో అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పరిష్కరించేందుకు ఆధార్‌లో మార్పులు, చేర్పులకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఎప్పటికప్పుడు అవకాశం కల్పిస్తూ వస్తున్నది. మిగతా.. 2లో



- పేదల కోసం మాట్లాడే వారిలో అసదుద్దీన్ ఓవైసీ ఒకరు
- "ప్రొఫెట్ ఫర్ ది వరల్డ్ " పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## మజ్లిస్ సహకారంతో మూసీ ప్రక్షాళన

**హైదరాబాద్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** ఒక మంచి పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం నాకు లభించింది. గీత, బైబిల్, ఖురాన్ సారాంశం ప్రపంచ శాంతి మాత్రమే.కలిసికట్టుగా దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్ని మత గ్రంథాలు చెబుతున్నాయి. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మన ప్రాంతానికి చెందిన వారు కావడం గర్వకారణం.

గతంలో హైదరాబాద్‌లో ఒక వైపు ఓవైసీ, మరో వైపు నేను ఎంపీగా ఉన్నాం. అసదుద్దీన్ ఓవైసీ కొన్ని సార్లు కాంగ్రెస్ పై కూడా విమర్శలు చేసేవారు. మంచి ప్రభుత్వాన్ని నడపాలంటే మంచి ప్రతిపక్షం కూడా ఉండాలి. పార్లమెంట్‌లో పేదల తరఫున మాట్లాడే నేతలు తగ్గిపోయారు. కార్పొరేట్ రంగంలో, మిగతా.. 2లో

## 20న తెలంగాణ కేబినేట్ భేటీ

**హైదరాబాద్, సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** తెలంగాణ మంత్రివర్గం సమావేశం ఈ నెల 20న జరుగనుంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రిమండలి భేటీ అవుతుంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో వరదలు, కేంద్ర ప్రభుత్వ సాయంపై చర్చించనున్నారు. అదేవిధంగా హైడ్రా పని విధానం, హైడ్రా చట్టబద్ధతకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశంపై చర్చిస్తారు. బీసీ రిజర్వేషన్, కులగణన, 200 పంచాయతీయల ఏర్పాటుపై ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశం చర్చకు రానుంది. దీంతోపాటు రుణమాఫీ, రైతుభరోసాపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది.

## మీ దీదీగా వచ్చా..

- ఆందోళన విరమించండి
- వైద్యుల శిబిరానికి నేరుగా వచ్చిన మమత
- వారితో పలు అంశాలపై చర్చించిన సిఎం

**కోల్‌కతా,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న జూనియర్ వైద్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చర్చల విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈక్రమంలో శనివారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులతో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడారు. స్వయంగా ఆమె నిరసన శిబిరానికి




వెళ్లి.. వైద్యులు తిరిగి విధుల్లో చేరాలని కోరారు.ఈ హత్యాచార ఘటనను నిరసిస్తూ పశ్చిమ బెంగాల్ ఆరోగ్యశాఖ మిగతా.. 2లో

## శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తాం..

- ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం దారుణం
- సీఎల్పీని విలీనం చేసుకుని విపక్షం లేకుండా చేసిన ఘనులు
- ప్రతిపక్షం అంటే గౌరవం ఉందన్న డిప్యూటీ సిఎం భట్టి
- మేడారం గ్రామంలో సోలార్ పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకుంటే మాకేం సంబంధం అన్న శ్రీధర్ బాబు

**కరీంనగర్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** బాధ్యతగల ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధ కలిగించిందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మిగతా.. 2లో





## అరికెపూడి గాంధీపై హత్యాయత్నం కేసు

- కౌశిక్ రెడ్డి ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి వ్యవహారంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై హత్యాయత్నం కేసు నమోదైంది. కౌశిక్‌రెడ్డి ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. గాంధీ సోదరుడు, కుమారుడు పృథ్వీతోపాటు కార్పొరేటర్లు వెంకటేశ్ గౌడ్, శ్రీకాంత్‌లను నిందితులుగా చేర్చారు. ఈ నెల 12న కౌశిక్‌రెడ్డి నివాసంపై అరికెపూడి గాంధీ అనుచరులు దాడికి పాల్పడిన మిగతా.. 2లో

## కాశ్మీర్ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు

- ఇంతకాలం విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయి
- అప్రకటిత కర్ఫ్యూల కాలం ముగిసింది
- వారసత్వ రాజకీయాలు కాశ్మీర్‌ను దెబ్బతీసాయి
- కొత్త నాయకత్వంతోనే కాశ్మీర్ అభివృద్ధి : ప్రధాని మోడీ

**చండీఘడ్/శ్రీనగర్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలోకి దిగారు. కాశ్మీర్, హర్యానా ఎన్నికల్లో ప్రచారం చేపట్టారు. తొలిసారి దోడా జిల్లాలో పర్యటించారు. కాశ్మీర్‌లో శాంతిస్థాపనకు కట్టుబడి ఉన్నామని అన్నారు. మిగతా.. 2లో





## ఏకేజీ భవన్‌కు ఏచూరి భౌతిక కాయం

- దివంగత నేతకు లెఫ్ట్ నేతల నివాళి
- నివాళి అర్పించిన సోనియా, తదితర నేతలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని శనివారం ఉదయం 11 గంటలకు ప్రజల సందర్శనార్థం వసంత్ కుంజ్‌లోని నివాసం నుండి మూడు దశాబ్దాలుగా పని చేసిన పార్టీ కేంద్ర మిగతా.. 2లో

# త్వరలోనే ఆర్డినెన్స్...

(మొదటి పేజీ తరువాయి)

శాఖలకు సహకారం అందిస్తాం. గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలో హైడ్రా పనిచేస్తుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ లోపు ఆర్డినెన్స్ రాబోతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన విషయాన్ని వెల్లడించారు. చాలా మంది హైడ్రాపై అనేక అనుమానాలు లేవనెత్తున్నారని, కొంతమంది కోర్టులను సైతం ఆశ్రయించారని.. అలాంటి వారికి త్వరలోనే సమాధానం దొరుకుతుందని రంగనాథ్ చెప్పుకొచ్చారు. తెలంగాణ క్యాబినెట్ ఆమోదంతో హైడ్రాకు విశేషాధికారాలు కల్పిస్తూ ఆర్డినెన్స్ రాబోతున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన క్రెడాయ్ సమావేశంలో కమిషనర్ రంగనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ..' తెలంగాణ ప్రభుత్వం జులై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసింది. హైడ్రాకు చట్టబద్ధత ఉందా, లేదా? అని ఇవాళ కొంతమంది ప్రశ్నిస్తున్నారు. దీనిపై కొంత మంది న్యాయస్థానాలకు సైతం వెళ్లారు. హైడ్రా చట్టబద్ధమైనదే. ఎగ్జిక్యూటివ్ రెజల్యూషన్ ద్వారా దీన్ని ఏర్పాటు చేశారు. ప్లానింగ్ కమిషన్, క్యాబినెట్ సెక్రటేరియెట్, లా కమిషన్, ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వంటివి ఎన్నో ఎగ్జిక్యూటివ్ రెజల్యూషన్ ద్వారానే ఏర్పాటయ్యాయి. అక్టోబర్ లోపు హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాబోతుంది. హైడ్రాను చట్టబద్ధం చేసేందుకు తెలంగాణ సర్కార్ పని చేస్తుంది. త్వరలో క్యాబినెట్ ఆమోదంతో దీనికి విశేషాధికారాలు రానున్నాయి. వాల్టా, మున్సిపల్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల చట్టాల్లోని విశేషాధికారాలు సైతం హైడ్రాకు వస్తాయి. ఆరు వారాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో హైడ్రా బిల్లు తీసుకురాబోతుంది. మున్సిపాలిటీలు, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు హైడ్రా సహకారంగా ఉంటుంది. గ్రే హౌండ్స్, టాస్క్ ఫోర్స్ తరహాలోనే హైడ్రా పని చేస్తుందని చెప్పారు.

# మీ దీదీగా వచ్చా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యాలయం 'స్వస్థ్ భవన్' ఎదుట జూనియర్ వైద్యులు గత నెల రోజులుగా ఆందోళన సాగిస్తున్న విషయం తెలిసిందే. మధ్యాహ్నం నిరసన శిబిరానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెళ్లారు. ఆమెను చూడగానే 'న్యాయం కావాలి' అంటూ జూనియర్ వైద్యులు నినాదాలు చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఈ సమస్యను పరిష్కరించడానికి ఇదే తన చివరి ప్రయత్నం అని అన్నారు. గతంలో నేనూ విద్యార్థి నాయకురాలిగా ఉద్యమాల్లో పాల్గొన్నా. ఆందోళన చేయడం మీ హక్కు. కానీ సమస్యను పరిష్కరించేందుకు మీతో చర్చల కోసం చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నా. భద్రతా సిబ్బంది వద్దని చెప్పినప్పటికీ మీ ఆందోళనలకు సెల్యూట్ చేసేందుకు వచ్చా. ఇక్కడికి నేను ముఖ్యమంత్రిగా రాలేదు. మీ దీదీగా వచ్చా. నాకు సీఎం పదవి ముఖ్యం కాదు. కానీ, నేనొక్కదాన్నే ప్రభుత్వాన్ని నడపట్లేదు కదా. బాధితురాలికి న్యాయం జరగాలనే నేనూ కోరుకుంటున్నా' అని మమతా బెనర్జీ అన్నారు. 'ఎండా, వానల్లోనూ మీరు రోడ్లపై ఆందోళన చేస్తుంటే నేను ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతున్నా. మీ డిమాండ్లను కచ్చితంగా అధ్యయనం చేస్తాం. బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం. ఆర్జీ కర్ ఆసుపత్రిలో రోగుల సంరక్షణ కమిటీని రద్దు చేస్తున్నా. దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని సీబీఐని కోరుతున్నా. నామీద విశ్వాసం ఉంటే.. చర్చలకు రండి. మీరు వెంటనే విధుల్లో చేరండి. మీపై ఎలాంటి చర్యలు తీసుకోబోం' అని మమతా బెనర్జీ కోరారు. అయితే, తమ డిమాండ్లపై చర్చ జరిగేవరకు రాజీకొచ్చే ప్రసక్తే లేదని వైద్యులు తేల్చిచెప్పడంతో సీఎం అక్కడినుంచి వెళ్లిపోయారు.

# ఎకెజి భవన్‌కు ఏచూరి భౌతిక కాయం

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం ఎకెజి భవన్‌కు తరలించారు. దివంగత నేతకు నివాళులు అర్పించేందుకు సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ శ్రేణులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, మేధావులు, వివిధ వర్గ, సంఘాల నాయకులు, ప్రజా ఉద్యమాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎకెజి భవన్‌కు చేరుకొని సీతారాంకు నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయుకురాలు సోనియా గాంధీ, జైరాం రమేష్, అజయ్ మాకెన్, రాజీవ్ శుక్లా తదితరులు నివాళులర్పించారు. ఎన్సీపీ



(ఎస్పీ) అధ్యక్షుడు, ప్రముఖ రాజకీయ నాయకుడు శరద్ పవార్ ఏకేజీ భవన్‌కు వచ్చి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు.

కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, అస్సాం, బీహార్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీల సిపిఎం నేతలు సీతారాం ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించారు.

మధ్యాహ్నం 3 గంటలకు అక్కడి నుంచి ఎయిమ్స్ వరకు అంతిమ యాత్ర సాగుతుంది. అనంతరం ఆయన కోరుకున్న విధంగా భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు కుటుంబ సభ్యులు అప్పగిస్తారు.ఎయిమ్స్ నుంచి జెఎన్‌యుకు తీసుకొచ్చి స్టూడెంట్స్ యూనియన్ హాలులో శుక్రవారం సాయంత్రం ఉంచారు. సాయంత్రం 4 గంటల వరకు జెఎన్‌యులో నివాళులర్పించే కార్యక్రమం కొనసాగింది. ఆ తరువాత ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల సందర్శనార్థం వసంత్ కుంజ్‌లోని నివాసానికి తరలించారు.

## అరికెపూడి గాంధీపై
# హత్యాయత్నం కేసు

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్టు అంటూ ఇంటికే పరిమితం చేసిన పోలీసులు.. కూకట్‌పల్లి నుంచి కొండాపూర్ దాక 9 కిలోమీటర్లు మందీమార్బలంతో అరికెపూడి బయల్దేరినా పోలీసులు చూడనట్టే ఉండిపోయారు. భారీ కాన్వాయ్‌తో కౌశిక్ ఇంటికి చేరిన గాంధీ.. తన అరుచరులతో కలిసి ఆయన నివాసంపై దాడికి పాల్పడ్డారు. టమాటాలు, గుడ్లు, రాళ్లతో విధ్వంసం సృష్టించారు. ఇంటి అద్దాలు పగులగొట్టారు. పూల కుండీలను ధ్వంసం చేశారు.

కాగా, ఇదే వ్యవహారంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహా 15 మంది ఆయన అనుచరులపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద ఇప్పటికే రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు. కౌశిక్‌రెడ్డితోపాటు గచ్చిబౌలి పోలీసులు సైతం ఎమ్మెల్యే గాంధీ, అతడి అనుచరులపై ఫిర్యాదులు చేయడంతో ఈ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దాడి, హత్యాయత్నం చేసినట్టు కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, తమ విధులకు ఆటంకం కలిగించినట్టు గచ్చిబౌలి ఎస్ఐ మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు రెండు వేర్వేరు ఫిర్యాదులపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే గాంధీ సహా 15 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు అతడి అనుచరులు ఉప్పలపాటి శ్రీకాంత్, బీ గౌతమ్‌గౌడ్, రాంపల్లి వెంకటేశ్, జీ రాములు, నరేశ్, మేల శివ, రాధిక, మంజుల, చంద్రికగౌడ్, రంగం నాగేందర్‌యాదవ్, డీ వెంకటేశ్ గౌడ్, అశ్రఫ్, రఘునాథ్‌రెడ్డి, మోహన్‌గౌడ్ తదితరులపై పలు సెక్షన్ల కింద కేసులను నమోదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించారంటూ గచ్చిబౌలి ఎస్ఐ మహేశ్‌కుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే గాంధీ సహా 15 మందిపై కేసులు నమోదు చేశారు. దీంతో దాడికి పాల్పడిన గాంధీ, అతడి అనుచరులపై రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

# కాశ్మీర్ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్ భవిష్యత్తును నిర్ణయించనున్నాయని ప్రధాని మోదీ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మన జమ్మూకశ్మీర్‌ను విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ శనివారం జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించారు. ఆ తరహా పార్టీలు ఈ ప్రాంతంలో అభివృద్ధిని దెబ్బతీశాయని విమర్శించారు. ఇకముందు అప్రకటిత కర్ఫ్యూలు ఉండవని, ఆరోజులు ముగిశాయని చెప్పారు. అలాగే భాజపా కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని పరివారవాదులు వంచన చేయడం ప్రారంభించారు. మీరు విశ్వసించిన రాజకీయపార్టీలు మీ పిల్లల భవిష్యత్తును పట్టించుకోలేదు. వారు వారి వారసుల భవిష్యత్తుపైనే దృష్టిసారించారు.జమ్మూకశ్మీర్ యువత ఉగ్రవాదంతో బాధపడింది. ఈ వారసత్వ పార్టీలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించి, వేడుక చూశాయి.

2000 సంవత్సరం నుంచి ఇక్కడ పంచాయతీ ఎన్నికలు జరగలేదన్న సంగతి మీకు తెలిసిందే. కొత్త నేతలకు అవకాశం ఇవ్వలేదు. అందుకే కొత్తనాయకత్వాన్ని మీ ముందుకు తీసుకురావాలని ప్రయత్నించాను. తర్వాత వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి చేర్చడమే ఈ ఎన్నికల అసలు లక్ష్యం. ఈ ప్రాంతంలో అప్రకటిత కర్ఫ్యూలు ఉండేవని మీకు తెలుసు. లాల్‌చౌక్ వద్దకు వెళ్లాలంటే భయపడేవారు. కాంగ్రెస్ హయాంలో కేంద్రంలో హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తి కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఆ రోజులు ముగిశాయి అని మోదీ మాట్లాడారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వెల్లడించారు. పలు హామీలను ప్రకటించారు. ఇదిలా ఉంటే.. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ లో మరో నాలుగు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం కానున్న తరుణంలో.. వరుసగా ఉగ్రదాడులు, ఎన్‌కౌంటర్‌లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. కిష్త్‌వాడ్, ఉధంపుర్, పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో యాంటీ టెర్రర్ ఆపరేషన్లను మరింత పెంచినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఈ ప్రాంతాల్లో వరుసగా రెండోరోజు గాలింపుచర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. గత 42 ఏళ్లలో భారత ప్రధాని ఈ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబరు 18న తొలివిడత పోలింగ్ జరగనుంది. చీనాబ్ లోయలోని కిష్త్‌వాడ్, రాంబన్, దోడాతో పాటు దక్షిణ కశ్మీర్ జిల్లాల్లోని మొత్తం 24 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇదిలావుంటే కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రజాసేవ చేసేందుకు తనను ఆశీర్వదించిన ప్రజలు హర్యానాలోనూ బీజేపీకి 'హ్యాట్రిక్' విజయాన్ని అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారు. హర్యానా ప్రజల ఉత్సాహాన్ని చూస్తే బీజేపీని తిరిగి గెలిపించాలనే కృతనిశ్చయంతో ఉన్నట్టు చెప్పగలనని అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల

ప్రచారంలో భాగంగా కురుక్షేత్రలో జరిగిన ర్యాలీలో మోదీ శనివారంనాడు పాల్గొని ప్రసంగించారు.

రైతులు, పేదలు, యువకులు, మహిళలకు లబ్ది చేకూర్చేందుకు కేంద్రం ఇటీవల తీసుకున్న పలు నిర్ణయాలను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపై రైతులు, పేదలు, యువకులు, మహిళలకు లబ్ది చేకూర్చేందుకు భారీ నిర్ణయాలు తీసుకుంటామని నేను వాగ్దానం చేశాను. ఇంకా 100 రోజులు కూడా పూర్తికాకుండానే రూ.15 లక్షల కోట్ల పథకాలను మా ప్రభుత్వం ప్రారంభించింది. పేద కుటుంబాలకు 3 లక్షల పక్కా గృహాలకు ఆమోదం తెలిపాం' అని మోదీ తెలిపారు. హర్యానాలో బీజేపీ ప్రభుత్వం పనితీరుతో పొరుగున ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ సర్కార్‌తో మోదీ పోల్చారు.

హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేసిందన్నారు. ఫలితంగా వేతనాల కోసం ప్రభుత్వ ఉద్యోగులు నిరసలకు దిగుతున్నారని అన్నారు. కాగా, హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి.

# శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

పర్యటన సందర్భంగా.. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ వ్యవహారంపై స్పందించారు. ఎమ్మెల్యేలు రోడ్డెక్కి కొట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం ఏం చేయాలో అది చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని గౌరవించాలని ఉపేక్షించాం. గత భారాస ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ప్రతిపక్ష హోదా లేకుండా సీఎల్పీ సీటును సైతం గుంజుకున్నారు. వాళ్ల మాదిరిగా మేము ప్రవర్తించడం లేదు. అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు వినిపించాలని కోరుకుంటున్నాం.

ప్రతిపక్ష నేతలంటే మాకు గౌరవం ఉంది. అసెంబ్లీలో అధికార పార్టీ ఎవరో.. ప్రతిపక్ష పార్టీ ఎవరో స్పీకర్ వెల్లడించారు. శాంతిభద్రతలు కాపాడటం మా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత. భాజపా ఉనికి కోసం రాజకీయ డ్రామాలు ఆడుతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల అకాంక్షలను..చట్టాలుగా మార్చి పాలన కొనసాగిస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దశాబ్ద కాలంగా పెండింగ్ లో వున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామ ప్రజలకు 18 కోట్ల రూపాయలను అందజేశామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా రుణమాఫీ విషయంలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు.

రైతులకు ఇన్స్యూరెన్స్ డబ్బులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్న భట్టి... 2030 వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా రైతులకు ఆదాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా 30 గ్రామాలకు ప్రభుత్వ ఖర్చుతో వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ పవర్ అందించనున్నామన్నారు. మేడారం గ్రామాన్ని సోలార్ పవర్ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా 18 వేల కోట్ల రూపాయలను 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేదన్న భట్టి ఎల్లంపల్లి ముంపు గ్రామస్తులకు పెండింగ్ లో ఉన్న 18 కోట్ల



రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ఆదిలాబాదు నుండి ఖమ్మం వరకి పాదయాత్ర చేసానని, మీ అందరి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజల ఆశయాలని చట్టాలుగా మార్చి పని చేస్తుంది మా ప్రభుత్వమని, ప్రాజెక్టుల కొసం భూములని ఇచ్చిన వారికి గౌరవం ఇవ్వాలి.అందుకే నిధులు విడుదల చేస్తున్నా మన్నారు. రెండు లక్షలు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చాం చేసి చూపామని, హామీ ఇవ్వకున్నా 2 లక్షల పైన ఉన్న పంట రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించామని, లక్ష రుణమాఫీ చేస్తానని మోసం చేసింది నాటి బిఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. రుణమాఫీపై బీఆర్ఎస్ మాట్లాడే మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన మండిపడ్డారు. రెండు లక్షల పైన ఉన్నవారికి కూడ వెసులుబాటు కల్పించే యత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా.' ఓడిపోయిన కూడ రోడ్ల మీదకి వచ్చి బిఆర్ఎస్ ఆందోళన చేస్తుంది. పంటలతో పాటుగా పవర్ ఉత్పత్తి ద్వారా రైతుకు ఆదాయం సమకూరే ఏర్పాటు చేస్తాం. మేడారం గ్రామానికి సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తాం. భవిష్యత్తులో విద్యుత్ రంగంలో తెలంగాణని మోడల్ గా తయ్యారు చేస్తాం.

పత్తిపాక రిజర్వాయర్ కోసం బడ్జెట్‌లో ప్రతిపాదించాము. త్వరలోనే పనులు మొదలు పెడతాం. ' అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఇద్దరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకుంటే.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. ఆ ఇద్దరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే.. వారి అంతర్గత విభేధాలతో కొట్టుకున్నారని క్లారిటీ ఇచ్చారు. పత్తిపాక రిజర్వాయర్ ని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. పనులు మొదలు పెడుతామన్నారు. పత్తపాక రిజర్వాయర్‌కి ఈ బడ్జెట్‌లో డబ్బులు కెటాయించామన్నారు. అర్థిక మంత్రిగా భట్టి ఈ రాష్ట్రంని బడ్జెట్ పరంగా గాడిలో పెడుతున్నారని అన్నారు. సాంకేతికపరమైన ఇబ్బందులు ఉంటే తప్ప అందరికీ రుణమాఫి అయ్యిందన్నారు. అంతకు ముందు పెద్దపల్లి జిల్లా మంథనిలో సెంటిలియన్ సాఫ్ట్ వేర్ కంపనీని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. మంథని ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభ ఉంటుందన్నారు. చదువుకున్న పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనేది మా సంకల్పం

అన్నారు. మా మంథని ప్రాంత మేధస్సుకు ప్రపంచ వ్యాప్తంగా పేరుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. మంథని లో త్వరలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టిపిసిసి ఎన్ఆర్ఐ సెల్ వినోద్ ఆధ్వర్యంలో మొత్తం 5 అంశాలపై చర్చించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం చేయడానికి ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గల్ఫ్ కార్మికుల కమిటీలో గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఈ కమిటీలో సభ్యులుగా నియమించాలని.. ఈ మేరకు జీవో విడుదల చేయాలని సూచించారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారం ప్రజావాణిలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రవాసి ప్రజావాణి నిర్వహించడంపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సెప్టెంబర్ 20 నుంచి గల్ఫ్ కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తామని చెప్పారు. గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలలో కళాశాలలో చదవాలని అనుకునే వారికి వందశాతం అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నుంచి గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇచ్చేలా సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. గతంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు సైతం రూ. 1 లక్ష ఎక్స్ గ్రేషియ ఇవ్వాలని సూచించింది. తెలంగాణ ఏర్పాటైన జూన్ 2 , 2014 లేదా ఎప్పటినుంచి తీసుకోవాలనే దానిపై కమిటీలు పలు సూచనలు చేశాయి. గల్ఫ్ లో మృతి చెందిన వేములవాడ నియోజకవర్గానికి చెందిన 2 కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ నుంచి ఎక్స్ గ్రేషియా ఇచ్చామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రైతు భీమా మాదిరి గల్ఫ్ భీమా ఉండాలని పలువురు ఎమ్మెల్యేలు సైతం సూచించారు. ఇటీవల సింగపూర్, మలేషియాలలోని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పగా.. టీపీసిసి ఎన్ఆర్ఐ కన్వీనర్ ఇమిగ్రేషన్ 1982 యాక్ట్ లో గల్ఫ్ దేశాల్లో 18 దేశాలు ఉంటాయి. సింగపూర్ లాంటి దేశాలు కూడా గల్ఫ్ కిందకి వస్తాయని కొందరు బదులిచ్చారు. తెలంగాణ లో 150 ట్రెడ్ లైసెన్స్ మన్ పవర్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలు ఉన్నాయి. టాంటం, న్యాక్, సెట్విన్ లాంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనీ సూచించారు. ఏజెన్సీల పేరుతో మోసం జరుగుతుందని, ఇకపై అలా జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటివరకూ గల్ఫ్ కార్మికులు ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని ఇక్కడికి రప్పించడానికి 7 రోజులకు పైగా పడుతోందని.. కనీసం 48 గంటల్లో డెడ్ బాడీ వచ్చేలా చూడాలని కోరారు. కేరళ రాష్ట్రంలో దేశంలో బెస్ట్ గల్ఫ్ పాలసీ ఉందని, వారి పాలసీని అధ్యయనం చేయాలని సమావేశంలో చర్చించారు. కేరళలో గల్ఫ్ కార్మికుల ద్వారా జీడీపీకి చాలా వస్తుందని తెలంగాణలో కూడా జీడీపీ గల్ఫ్ కార్మికుల ద్వారా అభివృద్ధి జరగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఎంబీబీఎస్, బీడీఎస్
# అడ్మిషన్ల పక్రియకు బ్రేకులు

(మొదటి పేజీ తరువాయి)

నిలదీశారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల పక్రియకు బ్రేకులు పడటం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. విద్యార్థులను ఆగం చేసి.. ఇంకెంత కాలం దీన్ని సాగదీస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డలను నాన్ లోకల్స్ గా మార్చి, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు పెద్దపీట వేసే జీవో 33 అమలు కోసం కాంగ్రెస్ సర్కారు ఎందుకింత మొండిపట్టు పడుతోందని నిలదీశారు. స్థానికతను నిర్ధారించే విషయాన్ని ప్రభుత్వం ఎందుకింత వివాదాస్పదం చేస్తోందని అడిగారు. రోజురోజుకూ ఇంకా ఎందుకు న్యాయపరమైన చిక్కుల్లోకి నెడుతోందని ప్రశ్నించారు. తమ పిల్లల్ని డాక్టర్లుగా చూడాలని కలలు కంటున్న వేలాది మంది తల్లిదండ్రుల ఆకాంక్షలను దెబ్బతీసే గొడ్డలిపెట్టు లాంటి నిర్ణయాలను ప్రభుత్వం ఇకనైనా వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

సమైక్య రాష్ట్రంలో కేవలం 5 మెడికల్ కాలేజీలు ఉంటే.. స్వరాష్ట్రంలో 29 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుని వాటి సంఖ్యను 34కు పెంచుకున్నది ఇందుకేనా అని ప్రశ్నించారు. జిల్లాకో మెడికల్ కాలేజీ నినాదాన్ని బీఆర్ఎస్ హయాంలో నిజం చేస్తే.. కాంగ్రెస్ సర్కారు రాగానే దారుణంగా నీరుగారుస్తోందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఎంబీబీఎస్ ను సీట్లను ఏకంగా 8915కు పెంచుకుని రాష్ట్రాన్ని డాక్టర్ల ఫ్యాక్టరీగా తీర్చిదిద్దితే, ఆ సమున్నత లక్ష్యానికి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. నాటి కేసీఆర్ విజన్‌కు.. నేటి కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో గ్రహణం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నీట్ అడ్మిషన్లలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ కొనసాగుతున్నది. ఆలిండియా కోటా కింద రెండో రౌండ్‌కు రిజిస్ట్రేషన్ల పక్రియ కొనసాగుతున్నది. కొత్తగా కాలేజీలు మంజూరైన నేపథ్యంలో గడువును పెంచారు. ఇందులో తెలంగాణ నుంచి నాలుగు కాలేజీలు ఉన్నాయి. మహేశ్వరం, మెదక్, కుత్బుల్లాపూర్, యాదాద్రిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా కింద 28 సీట్లను రిజర్వ్ చేశారు. రెండో రౌండ్‌లో ఈ సీట్లను కూడా జతచేశారు. కానీ రాష్ట్రంలో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ మాత్రం నిలిచిపోయింది. 'స్థానికత'ను నిర్ధారించడంలో ప్రభుత్వం విఫలం కావటం, హడావుడిగా జీవో33ను తీసుకురావటంతో అడ్మిషన్ల పక్రియ న్యాయవివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. దీంతో సొంత రాష్ట్రంలో వైద్యవిద్య చదవాలన్న వేల మంది విద్యార్థుల కల త్రిశంకుస్వర్గంలో ఊగిసలాడుతున్నది.

# మజ్లిస్ సహకారంతో మూసీ ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారాల్లో మన వాళ్లు అగ్రగామిగా ఎదుగుతున్నారు.పేదల తరుపున మాట్లాడే నాయకులు క్రమంగా తగ్గిపోతున్నారు. పార్లమెంట్ లో పేదల కోసం మాట్లాడే వారిలో అసదుద్దీన్ ఓవైసీ ఒకరు. ఎన్నికల ముగిసే వరకే రాజకీయాలు. ఆ తరువాత నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల కోసం అంతా కలిసి పనిచేయాలి.

మజ్లిస్ పార్టీ నుంచి వచ్చే సలహాలు, సూచనలను స్వీకరిస్తున్నాం. అనేక ఏళ్ల నుంచి మూసీ నది మురికి కూపంలా మారింది. మూసీ ప్రక్షాళన కోసం మజ్లిస్ సహకారం తీసుకుంటున్నాం. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను ఇవ్వనున్నాం. దేశాన్ని రక్షించుకునే బాధ్యత మనందరిది. ఒక మంచి మార్గంలో మనమంతా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కలిసిమెలిసి ప్రభుత్వాన్ని ముందుకు తీసుకుపోతాం.

చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు ప్రభుత్వాలను రెండు సార్లు గెలిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా రెండోసారి అవకాశం వస్తుందని నమ్ముతున్న. ఈ పదేళ్ల పాటు పేదల సంక్షేమం కోసం పనిచేస్తాం

## ఆధార్ ఉచిత నమోదు 14 వరకు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలోనే పదేండ్ల క్రితం నాటి ఆధార్ కార్డుల్లోని వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి కేంద్రం ఇచ్చిన గడువు శనివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఉడాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన చేసింది. దీంతో ఉడాయ్ అధికార వెబ్‌సైట్ లో ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ సాయంతో లాగిన్ అయి వివరాలను ఉచితంగానే అప్‌డేట్ చేసుకోవచ్చు. పోర్టల్‌లో ఆధార్ నంబర్ ద్వారా లాగిన్ కావాలి. ప్రొసీడ్ టు అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసిన అనంతరం డాక్యుమెంట్ అప్‌డేట్ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే స్క్రీన్‌పై వివరాలు వస్తాయి. వాటిని పూర్తిగా పరిశీలించి సవరణ ఉంటే చేయాలి. లేదంటే ఉన్న వివరాలతోనే నెక్స్ట్‌పై క్లిక్ చేయాలి. కిందికి స్క్రోలింగ్ చేస్తే వచ్చే ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ, ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ డాక్యుమెంట్లను ఎంచుకోవాలి. ఆయా డాక్యుమెంట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేస్తే అప్‌డేట్ పూర్తయినట్లు ఫోన్ నెంబర్‌కు పద్నాలుగు అంకెల అప్‌డేట్ రిక్వెస్ట్ నెంబర్ వస్తుంది. దీని ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు.

# కాళ్లు పట్టుకుని ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే తెలంగాణ ప్రజల పౌరుషం చాటారని అన్నారు. నిన్న మమ్మల్ని హౌస్ అరెస్ట్ చేసి, గాంధీకి రక్షణ కల్పించారని అన్నారు. అదే గాంధీని హౌస్ అరెస్ట్ చేస్తే ఇలాంటి సంఘటనలు జరిగేవి కావని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పదేళ్లలో శాంతి భద్రతలు అద్భుతంగా నిర్వహించామని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రజలు అందరూ మా వారే అని స్పష్టం చేశారు. ప్రాంతీయతత్వం మీద దాడులు గతంలో లేవు, ఇప్పుడు ఉండవని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి హైదరాబాద్ ప్రజలు అండగా నిలిచారని, రేవంత్ కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఎందుకు చేరావని అరికెపూడి గాంధీని నిలదీశారు. దిక్కుమాలిన పిఏసి పదవి కోసం ఇలాంటి మాటలు మాట్లాడేందుకు సిగ్గు ఉండాలని విమర్శించారు.




## పిసిసి అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన పగడాల సిద్దేశ్వర్ గౌడ్

**శంషాబాద్,సెప్టెంబర్ 14(నమస్తే ఉదయం):** పిసిసి అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్ కు శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకుడు పగడాల సిద్ధిశ్వర్ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. పిసిసి అధ్యక్షుడిగా నియమితులై ఢిల్లీకి వెళ్లి వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పిసిసి అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ గౌడ్ నేతృత్వంలో తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మైసయ్య కుటుంబానికి 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్,సెప్టెంబర్ 14( నమస్తే ఉదయం):** కవ్వగూడ గ్రామానికి చెందిన దేవరకొండ మైసయ్య యాదవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన కుటుంబానికి సీఎం



రిలీఫ్ ఫండ్ పథకం కింద మంజూరైన 60 వేల రూపాయల చెక్కును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం అందజేశారు. కవ్వగూడ మాజీ సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో చెక్కును అందజేశారు.

## మధుర నగర్ స్ట్రీట్ నెంబర్ 15లో ఘనంగా వినాయకుడి పూజలు...

### ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం...

**శంషాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే ఉదయం):** శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని మధుర నగర్ స్ట్రీట్ నెంబర్ 15 లో ప్రతిష్టించిన వినాయకుడి విగ్రహం వద్ద ప్రతిరోజు వైభవంగా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవ కమిటీ కాలనీ వాసులు మాచర్ల శ్రీనివాస్, లత దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు సభ్యులు ముత్యాల వీరేశం. ఈదుల నరసింహ గౌడ్. దండు గణేష్. కంది ప్రభాకర్.అశోక్ గౌడ్.శేఖర్. కృష్ణ.బొడ్డు మనోహర్. బొడ్డు విశాల్ కుమార్. ఈదుల వినయ్ గౌడ్. కుమార్. నాగేశ్వరరావు. ధనరాజ్.గుంటి రవి, వేణుగోపాల్. రాధాకృష్ణ. బసంత్ కుమార్. సాయి.శ్రీనివాస్ చారి. నాగరాజు. శ్రీరాములు. ప్రకాష్. సురేష్.మల్లేష్. పోలీస్ రాజు. పిల్లనగ్రోయిల రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గోమాతకు అంతిమ వీడ్కోలు..

### - ఘనంగా అంత్యక్రియలు

**అలంపూర్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** గోమాతకు అంతిమ వీడుకోలు పలికి హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు చేపట్టిన సంఘటన జోగులంబ గద్వాల జిల్లా మానవపాడులో చోటు చేసుకుంది.



మానవపాడు మండల కేంద్రంలో పరమేశ్వరుని ఆలయంకు దేవుని ఆవుగా భావించి ఓ గోమాతను చిన్నప్పుడే వదిలారు. శనివారం తెల్లవారుజామున ఆ గోమాత అనారోగ్యం వల్ల మృతి చెందింది. సంప్రదాయ బద్ధంగా బాజా బజంత్రీల మధ్య గోమాత ఆత్మకు శాంతి చేకూరాలని మన స్ఫూర్తిగా కోరుకుంటూ అంత క్రియలు నిర్వహించారు. చిన్నప్పుడే ఆవును వదిలిన యజమానితో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎద్దుల బండిపై హిందూ స్మశాన వాటిక వరకు తీసుకెళ్లి జెసిబి సహాయంతో అంతక్రియలు నిర్వహించారు. గోమాతకు దశదినకర్మలు నిర్వహించి బంధుమిత్రులకు దిన భోజనాలు ఏర్పాటు చేస్తామని యజమాని కురువ యోగేశ్వర్-శకుంతల చెప్పడంతో ఈ సంఘటన అందరినీ కంటతడి పెట్టించింది.

## ప్రజాస్వామ్య పరిరక్షణపోరాట యోధుడు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

**గద్వాల, జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 14(నమస్తే ఉదయం):** దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం భావ ప్రకటన స్వాతంత్రం కోసం నిరంతరం పోరాడిన పోరాట యోధుడు సిపియం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ అన్నారు శనివారం స్థానిక ధరూర్ మండల కేంద్రంలోనీ వైఎస్ఆర్ చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ యూనివర్సిటీలలో నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక చట్టాలు చేసిన ప్రతిసారి వాటిని చట్టసభలలో బయట ప్రశ్నించి సమాజాన్ని చైతన్యం చేశారన్నారు పాలక పక్షం అనుసరించే ప్రజా వ్యతిరేక ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఎండగట్టి పీడిత ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాల పైన చట్టాల పైన బహిరంగంగా వ్యక్తీకరించే వాక్ స్వాతంత్రాన్ని హరించే హక్కు ఏ ప్రభుత్వానికి లేదని చెప్పేవారన్నారు రచయితగా కూడా కార్మిక కర్షక అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండి సమాజం కోసం పనిచేసారని అన్నారు పెట్టబడుదారులు కార్పొరేట్ శక్తులు కార్మిక వర్గాన్ని దోపిడీ చేయడం కోసం చేసే కార్మిక వర్గ చట్టాలకు వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని చట్టసభలలో నిలదీసి కార్మిక వర్గానికి అండగా నిలిచారన్నారు ఆ మహనీయుని స్ఫూర్తితో కార్మిక ఐక్యంగా ఉండి సమాజ మార్పు కోసం పనిచేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దేవదాసు నాయకులు మేకల ఆంజనేయులు ప్రవీణ్ తిమ్మప్ప గోవిందు రాము పరశురాం తదితరులు పాల్గొన్నారు



### రేవులపల్లిలో..

ధరూర్ మండలం రేవులపల్లి గ్రామంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి గారికి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వివి నరసింహ మాట్లాడుతూ ఆర్థిక సామాజిక అంశాలు రెండింటిని మేలవించి నిల్ లాల్ జండాలు కలిసి ఐక్య పోరాటాలు నిర్వహించడం ద్వారా పెట్టుబడిదారులను గద్దె దింపి బహుజన రాజ్యం సాధ్యమవుతుందని అన్నారు పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంతకాలం వివక్ష అంటరానితనం అంతం కాదని పెట్టుబడుదారి భూస్వామ్య వ్యవస్థను అంతం చేసినప్పుడే ఆర్థిక సామాజిక సమానతలు లేని సమాజాన్ని ఏర్పరచవచ్చని ఆ దిశగా ఐక్య సామాజిక ప్రజా ఉద్యమాలు నిర్మించడమే ఆ పోరాట యోధుడికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ , సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి, దండోరా వెంకటన్న, చరణ్, రాళ్ళ బిమయ్య, మాజీ సర్పంచ్ శివా రెడ్డి, రామన్న ,లక్ష్మయ్య, డోల ఆంజనేయులు, శ్రీనివాసులు ,ఈశ్వర్, ఏసు సామేలు రాజు, శివాజీ, మద్దిలేటి, హొటల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.





## మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన బంధువులు

### నిందితులను గుర్తించి శిక్షించాలి
### మృతదేహాన్ని రిపోస్టు మార్టం చేయాలి
### మల్దకల్‌లో భారీగా మొహరించిన పోలీసులు
### పోలీసుల అదుపులో నిందితుడు
### ఆందోళన విరమించిన ఆందోళనకారులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 14(నమస్తే ఉదయం):** మద్దెలబండకు చెందిన బోయ జక్కిడిబావి నర్సింహులు (35) మృతదేహాన్నికి రీ పోస్టు మార్టం చేసి, హత్యకు కారకులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం మల్దకల్ మండల కేంద్రంలో బంధువులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పొలం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నర్సింహులపై దాడి చేసి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేసి విద్యుద్ఘాతంతో మృతి చెందినట్లు చిత్రీకరించినట్లు కుటుంబ సభ్యులు, బందువులు ఆరోపించారు. అంతేకాకుండా మల్దకల్



పోలీసులు కూడా కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని మండి పడ్డారు. నర్సింహులది ముమ్మాటికి హత్యనేని, దోషులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో గద్వాల అయిజ రోడ్డు మీద సుమారు మూడు గంటల పాటు వాహ నాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న గద్వాల సిఐ నాగేశ్వర్ రెడ్డి, మల్దకల్, గట్టు, కేటిదొడ్డి, గద్వాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, ఆందోళన విరమించేందుకు ప్రయత్నాలు చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు. హత్యకు కారుకులైన నిందితుల పేర్లు చెప్తామని వారిని గుర్తించి వారి పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆందోళనకారులు కోరారు. గద్వాల జిల్లా ఏఎస్పీ గుణశేఖర్, గద్వాల డీఎస్పీ సత్యనారాయణలు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి, ధర్నా విరమించాలని కోరారు. అనుమానవ్యక్తం చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆందోళన విరమించు కున్నారు. మృతదేహాని దహన సంస్కరణలకు తరలించారు.

### వివరాలకు వెళ్లితే..

మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన బోయ జక్కిడి బావి నర్సింహులు తన వ్యవసాయ పొలంలో పత్తి పంటను సాగుచేస్తున్నాడు. రోజులాగే పంట పొలానికి నీరుపారేందుకు వెళ్లగా శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ఘాతంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. నర్సింహులు మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు క్లూస్ టీం ద్వారా సహాయంతో దర్యాప్తు చేపట్టి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.





పద్మశాలిపురంలో నెలకొల్పిన విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, అన్నదానం కార్యక్రమంలో భక్తులు

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### పద్మశాలిపురం గణేష్ ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
### గణపతి చౌరస్తాలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రకాష్ గౌడ్ పూజలు

**రాజేంద్రనగర్ ప్రతినిధి(నమస్తే ఉదయం):** నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వినాయక పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. విఘ్నాన తొలగించే గణనాథుడికి పూజలు నిర్వహించడం ద్వారా సుఖసంతోషాలు కలుగుతాయని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం టీఎన్జీవోఎస్ కాలనీలో గణపతి చౌరస్తాలో ఏర్పాటుచేసిన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాధుని పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శుభ కార్యానికి అన్ని కలిసి వస్తాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం అని అన్నారు. వినాయక చవితి పండుగ ఎంతో వైభవంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తిరిగి వచ్చే వినాయక చవితి వరకు ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వ ర్యాలతో, పాడి పంటలతో సంతోషంగా ఉండాలనిఅన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను గణపతి చౌరస్తా కమిటీ సభ్యులు అందరూ కలిసి శాలువాతో సత్కరించారు. ప్రసాద వితరణ, అన్నదానం చేశారు. ఏర్పాటుచేసిన గణేశుడి మండపం మూడు సంవత్సరాల కాలంలోనే టీఎన్జీవోఎస్ కాలనీలో ప్రసిద్ధిగాంచింది.

ఈ మండపం వినాయకుడి లడ్డూను సుమారు రెండు లక్షల రూపాయలు చెల్లించి భక్తులు కొనుగోలు చేశారు. ప్రతి ఏటా గణనాధుని ఏర్పాటుతో తాము ఆర్థికంగా ఆరోగ్యపరంగా సుఖసంతోషాలతో ఉండగలుగుతున్నామని గణపతి చౌరస్తా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు మసన వెంకటేష్, భాస శ్రీనివాస్, ప్రేమ్ గౌడ్ గంజి వెంకటేష్, కాశి గారి యాదగిరి, ఏంజెల్ రాజు గుర్రం బాలరాజ్, శ్రీనివాస్ రెడ్డి త్రిలోక్ శర్మ గోంగూర శ్రీనివాసరావు శ్రీ రాములు హనుమంతు యాదయ్య రఘుమ రెడ్డి సారంగ రవి చెన్నరవి చిత్రా రెడ్డి భాస్కర్ రెడ్డి లింగస్వామి డీసీఎం సురేందర్ శేఖర్ రెడ్డి శేఖర్ స్వీట్ షాప్ రాజు రాజుగుప్త సురేంద్ర గుప్తా చారి అశోక్ సందీప్ అజయ్ వరుణ్ భాను బన్నీ విగ్నేష్ బద్రి స్థానిక నాయకులు మరియు లేడీస్ కూడా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## జోగులాంబ గద్వాల జిల్లా

# దస్తావేజు లేఖరుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 14(నమస్తే ఉదయం):**
ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా దస్తావేజులేఖరుల సంఘం సమావేశం శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా దస్తావేజులేఖరుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కొంకతి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ షబ్బీర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు, జాయింట్ సెక్రటరీగా తుమ్మల రవికుమార్, ట్రెజరీగా శాలి పైల్వాన్, సభ్యులుగా టి.కృష్ణ, పరశురాములు, వినోద్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీకి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా దస్తవేజులేఖరుల సంఘం నాయకులు హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.

## జోగులాంబ గద్వాల్ జిల్లా

# పిఎస్ హెచ్ఎం అసోసియేషన్

**గద్వాల, సెప్టెంబర్14(నమస్తే ఉదయం):**
గద్వాల పి ఎస్ హెచ్ ఎం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.జిల్లా కేంద్రంలోని జ్ఞాన ప్రభ జూనియర్ కళాశాలలో సమావేశం జరిగింది.. ఈసమావేశాని కి రాష్ట్ర అధ్యక్షులు బి మురళీధర్ గౌడ్ హాజరై, ఏ మండలంలోని ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత లు సీనియర్ ఎల్ ఎఫ్ ఎల్ హెచ్




ఎం, పిఎస్ హెచ్ ఎం లకు ఇవ్వాలని , పెండింగ్ లో ఉన్న 5 డి ఏ లను ఇవ్వాలని, పిఆర్సి 50% ప్రకటించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో 1 పి ఎస్ హెచ్ ఎం, 5 గురు ఉపాధ్యాయులును నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు సి.ప్రవీణ్ కుమార్, సోమసుందర్ గౌడ్‌ల ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల్ జిల్లా నూతన కమిటీ అధ్యక్షులుగా ఎస్ జయచంద్ర కుమార్ (చిన్న తాండ్రపాడు) ,జనరల్ సెక్రటరీగా ఎల్.మురళీధర్ (మన్నపురం) కోశాధికారిగా సురేషబాబు( ఐజ) మహిళా ఉపాధ్యక్షులుగా సుజాత( భూంపురం) గౌరవధ్యక్షులుగా మునిస్వామి(ఉండవెల్లి) వెంకట కృష్ణారెడ్డి( చిన్నపోతులపాడు)లను ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసమావేశంలో యోగేందర్. అయ్యస్వామి. వెంకటేశ్వర్లు, బుడ్డన్న, కెనడి, చంద్రశేఖర్, ఆంజనేయులు , రాజశేఖరెడ్డి.హుస్సేన్. లక్ష్మినారాయణ గౌడ్. మమతా. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 14 (నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి ప్రశాంత్ కాలనీ పొదుపు సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథులు వద్ద శుక్రవారం రాత్రి అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ముందుగా పొదుపు సంఘం సభ్యులు వినాయకుడి పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ అన్న ప్రసాదం కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# మజ్లిస్‌కు భయపడుతున్న సిఎం రేవంత్

### అందుకే విమోచనోత్సవాలకు రావడం లేదు : బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు

**హైదరాబాద్,సెప్టెంబర్14(నమస్తే ఉదయం):** మజ్లిస్ ఒత్తిడికి తలొగ్గి సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ విమోచన వేడుకలకు హాజరుకావడం లేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కేంద్రం నిర్వహించే వేడుకలకు ముఖ్యమంత్రి రాకపోవడం విచారకరమన్నారు. సీఎం రేవంత్ విమోచన దినమని ఎందుకు పలకట్లేదని ప్రశ్నించారు. ఈ నెల 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన వేడుకలను నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో పార్టీ నాయకులతో కలిసి ఎంపీ లక్ష్మణ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమోచన వేడులకు



సీఎం రేవంత్ రెడ్డి రాకపోవడంపై మండిపడ్డారు. గత మూడేండ్లుగా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన వేడుకలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. ఈ వేడుకలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా వస్తున్నట్లు బీజేపీ ప్రకటించింది. అయితే హర్యానా, జమ్ముకశ్మీర్ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఈ వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా కిషన్‌రెడ్డితోపాటు సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజాపన దినోత్సవం పేరుతో అధికారికంగా వేడుకలను నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటూ కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్ షెకావత్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ని ఆహ్వానించింది.





# గణేష్ ఉత్సవాలలో పటిష్టమైన భద్రత : డాక్టర్ జితేందర్

### ఊరేగింపు, నిమజ్జన ప్రాంతాలను సందర్శించిన అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 14(నమస్తే ఉదయం):**
గణేష్ విగ్రహాల అంతిమ ఊరేగింపు, నిమజ్జనానికి కేవలం 72 గంటల సమయం ఉన్నందున, ఈ మహత్తర కార్యక్రమాన్ని అతుకులు లేకుండా నిర్వహించేందుకు హైదరాబాద్ నగర పోలీసులు ఖచ్చితమైన తుది సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి శనివారంపోలీసు శాఖ , ఇతర విభాగాలతో కూడిన ఉమ్మడి రూట్ తనిఖీ జరిగింది. ఈ తనిఖీలో రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్, తెలంగాణ, నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, హైదరాబాద్ సిటీ,





జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాటా,హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, సిటీ అదనపు కమిషనర్విక్రమ్ సింగ్ మాన్, రాచకొండ సిపి సుధీర్ బాబు, నగర అడిషనల్ సీపీ పి విశ్వ ప్రసాద్, హైదరాబాద్ సిటీ, జోనల్ డీసీఎస్పీ ఆఫ్ లా అండ్ ఆర్డర్ అండ్ ట్రాఫిక్ , హైదరాబాద్ సిటీ పోలీస్‌లోని ఇతర విభాగాలు, హెచ్ఎండిఏ, రోడ్లు భవనాలు, విద్యుత్, జలమండలి సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మార్గ పరిశీలన ప్రసిద్ధ బాలాపూర్ గణేష్ దేవాలయం నుండి ప్రారంభమైంది , ప్రధాన ఊరేగింపు మార్గంలో అనేక ముఖ్యమైన ప్రాంతాలను కవర్ చేసింది.

బాలాపూర్ నుండి హుస్సేన్ సాగర్ వరకు ఉన్న మొత్తం 19 కి.మీ మార్గంలో చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, నయాపూల్, ఎంజె మార్కెట్ , తెలుగు తల్లి ఫ్లైఓవర్ వరకు కీలక స్థానాలు ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులందరూ తమ వంతు కృషి చేయాలని, సమన్వయంతో పనిచేయాలని డీజీపీ ఆదేశించారు. సిపి, హైదరాబాద్ నోడల్ డిపార్ట్‌మెంట్‌గా సిటీ పోలీస్ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు . ఊరేగింపు అన్ని శ్రేణులు తమ వంతు సహకారం అందించే మార్గంలో సజావుగా, వేగవంతమైన కదలికను నిర్ధారించాలని నొక్కి చెప్పారు.

ఈ బృందం రాజేష్ మెడికల్ హాల్ నుండి గుల్జార్ హౌజ్ వరకు నడిచింది , విగ్రహాల ఊరేగింపుల ప్రవాహం , లా & ఆర్డర్ , ట్రాఫిక్ వింగ్‌ల పాత్రను అర్థం చేసుకోవడానికి ఎం జె మార్కెట్ జంక్షన్,తెలుగు తల్లి జంక్షన్‌లో కూడ ఆగింది. ఇతర శాఖల అధికారులు కూడా చేస్తున్న ఏర్పాట్లను పంచుకున్నారు.

వివిధ మండలాల నుంచి విగ్రహాలను సకాలంలో తరలించాలని అధికారులందరికీ పునరుద్ఘాటించారు. మార్గంలో ఎత్తు పరిమితులు , జంక్షన్ క్లియరెన్స్‌లు కూడా నొక్కి చెప్పబడ్డాయి.

గణేష్ ఉత్సవాల కోసం హైదరాబాద్ సిటీ పోలీసులతో పాటు బయటి నుంచి కూడా దాదాపు 25 వేల మంది పోలీసు బలగాలను మోహరిస్తున్నారు. వారి వసతి, భోజనానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు.

ఊరేగింపులో భాగమైన నగరంలోని వివిధ రహదారులు సాధారణ ట్రాఫిక్ కోసం మూసివేయబడతాయి లేదా ట్రాఫిక్ మళ్లింపులను చూస్తాయి. బహుళ క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు , యాంటీ-చైన్ స్నాచింగ్ టీమ్‌లు, షీ టీమ్‌లు కూడ మోహరించబడతాయి. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, విద్యు త్, రోడ్లు భవనాలు, జలమండలి, రవాణా శాఖ , వైద్య ఆరోగ్యశాఖ మొదలైన అన్ని విభాగాలకు చెందిన సీనియర్ అధికారులతో కూడిన జాయింట్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సెప్టెంబర్ 17వ తేదీ తెల్లవారుజామున టి జి, సి సి వద్ద పూర్తిగా పని చేస్తుంది.

ఈ సంవత్సరం గణేష్ విగ్రహాల ఊరేగింపు , నిమజ్జనం చిరస్మరణీయమైన , సంఘటనలు లేని వేడుకగా చేయడానికి చట్టాన్ని అమలు చేసే అధికారులకు సహకరించాలని, భద్రతా మార్గదర్శకాలను అనుసరించాలని నగర పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.





# నిమజ్జానికి తరలివెళ్తున్న గణనాథులు

### కృష్ణానది వద్ద బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 14(నమస్తే ఉదయం):**
జిల్లాలో గణపతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో వినాయక ప్రతిమలకు ఘనంగా పూజలు నిర్వహించి మేళ తాళాలతో శనివారం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

యువత బోలో గణేష్ మహారా జ్ కే జై, బైబై వినాయక అంటూ ఉత్సాహంగా వినాయక విగ్రహాలకు పూజలు చేసి డిసిఎం, బొలేరో, ట్రాక్టర్‌లపై ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదానాలు, లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. డీజే చప్పుళ్లు, చిన్నారులు, యువత నృత్యాల మధ్య గణనాథుడిని ఊరేగింపుగా తరలించి బీచు పల్లి, నదీఅగ్రహారంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేస్తున్నారు. భక్తులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథులను గంగమ్మ ఒడికి చేరుస్తున్నారు.

కృష్ణానదీ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగ కృష్ణానదీ భారిగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గజ ఈతగాళ్లను సిద్దం చేశారు.

# ఆయిల్ పాం సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

**మదనాపురం, సెప్టెంబర్ 14(నమస్తే ఉదయం):**
మదనాపురంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో "ఆయిల్ పాం సాగులో యాజమాన్య మేలుకువలు" అనే అంశంపై రైతులకు 5 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమంలో వనపర్తి , గద్వాల జిల్లాల నుండి సుమారు 40 మంది రైతు సోదరులు, సోదరీమణులు హాజరవుతున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన , పట్టు పరిశ్రమ శాఖ అధికారి నాగిరెడ్డి ఆయిల్ పామ్ సాగుకై ప్రభుత్వ సబ్సిడీ పథకాల గురించి రైతులకు తెలియజేశారు.






కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి వ్యవసాయం , అనుబంధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాల ఆవశ్యకతను, పంటల వైవిధ్యానికి కావలసిన మెలకువలను రైతులకు వివరించారు. ఆత్మకూర్ క్లస్టర్ ఉద్యాన శాఖ అధికారి సురేష్ ఉద్యాన శాఖ పథకాల గురించి రైతులకు తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త శ్రీ సురేష్ కుమార్ మాట్లాడుతూ... పామాయిల్ పంట సాగులో యాజ మాన్యాలను వివరించారు.పామాయిల్ ప్రపంచంలో కెల్లా అత్యధికంగా వంట నూనెను ఇస్తున్న పంట.

ఇది మన రాష్ట్రానికి పూర్తిగా అనుకూలమైన పంట. సంవత్సరం మొత్తం నీటిపారుదల అవకాశమున్నట్లయితే రైతులు పామాయిల్ సాగు చేసుకోవచ్చు. వీటితోపాటు సాగు నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పామాయిల్ మొక్కలు నాటుకునే విధానం వంటి అంశాలను రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ కంపెనీ ఉద్యోగులు బాల ప్రకాష్ , సతీష్, రాజు, దేవేందర్, రైతులు ఉద్యాన శాఖ అధికారులు శివ తేజ, కే వి కే సిబ్బంది పాల్గొన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733